హైదరాబాద్ వార్త

రాజకీయ మిత్రులు.. శత్రువులు..

విజయారెడ్డిని కలిసిన నవీన్‌యాదవ్

విష్ణువర్ధన్‌రెడ్డి తో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మాగంటి సునీత

- జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో విచిత్ర పరిస్థితి

జూబ్లీహిల్స్, అక్టోబరు 15, ప్రభాతవార్త:

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరంటారు.. ఇందుకు జూబ్లీహిల్స్ నియోజకవర్గ రాజకీయాలు అద్దం పడుతున్నాయి.. ఒకే కుటుంబంలోని అన్నా, చెల్లెలు రాజకీయ ప్రత్యర్థులుగా ఉండగా.. ఒకే పార్టీలో ఉండి సీటు కోసం పోటీపడిన ఆశావాహులు ఇప్పుడు రాజకీయ మిత్రులుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడింది.. రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే అనడానికి మారిన ఈ పరిస్థితులు నిదర్శనంగా కనిపిస్తున్నాయి.

అన్నా, చెల్లెలు.. రాజకీయ శత్రువులు

పీజేఆర్.. రాజకీయాల్లో ఆయనది ప్రత్యేక స్థానం. రాజకీయాల్లో ఆయనకంటూ ఓ ప్రత్యేకమైన చరిత్ర ఉంది. అలాంటి పీజేఆర్ వారసులైన పి. విష్ణువర్ధన్‌రెడ్డి ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌కు అతను ఈ ఎన్నికల్లో మద్దతుగా నిలిచారు. గత ఎన్నికల్లో మాగంటి గోపీనాథ్‌కు ప్రత్యర్థి ఆయిన విష్ణువర్ధన్‌రెడ్డి మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో బీఆర్ఎస్‌లో చేరి కారుకు జై కొడుతున్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నవీన్‌యాదవ్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్, పీజేఆర్ కుమార్తె పి. విజయారెడ్డి ఆయనకు మద్దతుగా నిలిచారు. తాజాగా పీజేఆర్‌పై నవీన్‌యాదవ్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కొంత రాజకీయ దుమారం లేచినా విజయారెడ్డిని కలిసిన నవీన్‌యాదవ్ పీజేఆర్ యూనివర్శల్ నాయకుడు, ప్రజానాయకుడు అంటూ తన వ్యాక్యలను సరిదిద్దుకున్నారు. దీంతో విజయారెడ్డి తన పూర్తి మద్దతును నవీన్ యాదవ్‌కు ప్రకటించడమే కాకుండా నవీన్ యాదవ్ గెలుపు కోసం ప్రచారాన్ని సైతం నిర్వహిస్తామని ప్రకటించారు. దీంతో ఒకే కుటుంబానికి చెందిన పీజేఆర్ కుమారుడు, కుమార్తె ఇప్పుడు రాజకీయంగా శత్రువులుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఎన్నికల్లో గెలుపు ఓటముల్లో వీరి పాత్ర ప్రధానంగా మారనుంది.

నిన్నటి వరకు అభ్యర్థిత్వ వైరం..

కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థి ప్రకటన ముందు వరకు నియోజకవర్గంలో చాలా మంది ఆశావాహులు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన భవానీశంకర్, సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్, అజారుద్దీన్, మురళీగౌడ్ ఇలా అందరూ టిక్కెట్ ఆశించారు. టిక్కెట్ రాకపోవడంతో అందరూ అలకబూని అటకెక్కారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు అభ్యర్థిత్వాన్ని దక్కించుకున్న నవీన్‌యాదవ్ అందరిని కలుపుకొని వెళ్తున్నారు. దీనికితోడు పార్టీ అధిష్టానం సైతం మంత్రులను రంగంలోకి దించి వారిని బుజ్జగించారు. అభ్యర్థిత్వం ఆశించి భంగపడ్డ వారిని ఒకతాటికిపైకి తీసుకొచ్చి నవీన్‌యాదవ్‌కు అండగా నిలిపేలా చేశారు. నవీన్‌యాదవ్‌తో భవానీశంకర్‌తోపాటు మరికొందరు నేతలు చాలా కాలంగా రాజకీయంగా విభేదించారు. అయితే నవీన్‌యాదవ్ అజారుద్దీన్‌తోపాటు నవీన్‌యాదవ్ ఇంటికి వెళ్లి మరీ తనకు మద్దతునివ్వాలంటూ కోరారు. బీజేపీలోనూ ఇప్పుడు ఇదే పరిస్థితి ఉంది. రాజకీయంగా అభ్యర్థిత్వం ఆశించిన జూటూరు కీర్తిరెడ్డి, ఆలపాటి లక్ష్మీనారాయణ, కిలారు మనోహర్‌ను సైతం కలిసేందుకు దీపక్‌రెడ్డి సిద్ధమవుతున్నారు. వారితో కలిసి ప్రచారాన్ని నిర్వహించడానికి సిద్ధమవుతున్నారు.

ఉల్లంఘనులకు 'చెక్'

ఫిల్మ్‌నగర్‌లో తనిఖీలు చేపడుతున్న ఫిల్మ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సంతోషం, పోలీసులు.

- రూ. 88.45లక్షల నగదు స్వాధీనం
- 255 లీటర్ల మద్యం పట్టివేత
- ఉల్లంఘనలపై 29 ఎఫ్ఐఆర్‌లు నమోదు

జూబ్లీహిల్స్, అక్టోబరు 15, ప్రభాతవార్త:

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం, మాదకద్రవ్యాల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించారు.. నియోజకవర్గంలోని ఎనిమిది పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక తనిఖీ బృందాలు, చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు.. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలతోపాటు పోలీసులుఎన్నికల నియమావళిని ఉల్లంఘనులపై దృష్టి సారించారు. భారీ మొత్తంలో లెక్కలు చూపని నగదును, మద్యంను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ప్రధాన పార్టీల అభ్యర్థులపై కేసులు నమోదు చేయడంతోపాటు మొత్తం 29 ఎఫ్ఐఆర్‌లను చేశారు. మరోవైపు నిఘా బృందాలు సైతం దేగకళ్లు వేశాయి.

చుట్టూ నిఘా పెట్టారు..

జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో సనత్‌నగర్, పంజాగుట్ట, మధురానగర్, బోరబండ, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, టోలిచౌకి, గొల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ బూత్‌లు వస్తాయి. ఈ ప్రాంతాల పరిధిలో స్టాటిస్టిక్ బృందాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలతోపాటు పోలీసులు ఎప్పటికప్పుడు నిఘా పెడుతున్నారు. ఎఫ్ఎస్‌టీ బృందాలు ఈ ఎనిమిది పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో నిత్యం సంచరిస్తూ ఎన్నికల నిబంధనల ఉల్లంఘనులపై దృష్టి సారించడమే కాకుండా వీడియోలు తీస్తూ, వాహనానికి ఉన్న సీసీ కెమెరా ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నాయి. మరోవైపు స్టాటిస్టిక్ బృందాలు (ఎస్ఎస్‌టి) మధురానగర్, ఫిల్మ్‌నగర్, బోరబండ, మధురానగర్, పంజాగుట్ట, బంజారాహిల్స్, సంతోష్‌నగర్, టోలిచౌకి ప్రాంతాల్లో చెక్ పాయింట్లను ఏర్పాటుచేశాయ.

భారీగా స్వాధీనం..

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన సంఘటనల్లో మొత్తం రూ. 88,45,200ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 7 నుండి 14 వరకు నిర్వహించిన తనిఖీల్లో భాగంగా పోలీసులు 251.96 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్ తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో బాణసంచాను సైతం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సయిజ్ పోలీసులు 3.6 లీటర్ల మద్యం పట్టుకున్నారు. పోలీసులు 0.077 గ్రాముల మాదకద్రవ్యాలను సైతం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, పోలీసులు పట్టుకున్న నగదు వివరాలను ఈ నెల 7 నుండి 14 వరకు గమనిస్తే..

ఎఫ్ఎస్‌టి	రూ. 12,90,000
ఎస్ఎస్‌టి	రూ. 45,72,600
పోలీసులు	రూ. 29,82,600

మొత్తం	రూ. 88,45,200

బెస్ట్ అవైలబుల్ స్కీమ్ ఎత్తివేసే కుట్ర

తార్నాక, అక్టోబర్ 15 ప్రభాతవార్త :

ప్రైవేట్ పాఠశాలలో ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ఉచిత విద్యను అందించే బెస్ట్ అవైలబుల్ స్కీమ్ పథకం కింద కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండు సంవత్సరాల నుండి నయా పైసా కూడా ఇవ్వకుండా ఈ బెస్ట్ అవైలబుల్ స్కీం పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర పనుతుందని బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి శ్రీను నాయక్ ఆరోపించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శ్రీను నాయక్ మాట్లాడుతూ నిరుపేద ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ప్రవేట్ పాఠశాలలలో ఉచిత విద్యను అందించే పథకమైన బెస్ట్ అవైలబుల్ స్కీం పథకం కింద కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలలలో రూ. 180 కోట్ల రూపాయలు బకాయి ఉన్నది. ప్రవేట్ పాఠశాల విద్యా సంస్థల యాజమాన్యం బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఎంపికై చదువుతున్న ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ఫీజు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు, బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో ఏనాడు కూడా ఈ బెస్ట్ అవైలబుల్ స్కీం పథకాన్ని నిరక్ష్యం చేయకుండా ప్రతి సంవత్సరం ప్రైవేట్ పాఠశాలలకు ఫీజు బకాయిలు చెల్లిస్తూ వచ్చిందన్నారు. ఈ స్కీం ద్వారా ఒకటి నుండి 4వ తరగతి విద్యార్థులకు సంవత్సరానికి రూ. 28 వేల రూపాయలు ట్యూషన్ ఫీజు మరియు ఐదు నుండి పదవ తరగతి వరకు చదువుతున్న పిల్లలకు సంవత్సరానికి 42,000 గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం చెల్లిస్తూ వచ్చింది. ఈ సంవత్సరం దసరా సెలవుల తర్వాత ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు ఫీజు చెల్లించాలని ఎస్సీ ఎస్టీ విద్యార్థుల తల్లిదండ్రుల పై తీవ్ర ఒత్తిడి చేస్తున్నాయి. గత వారం రోజులుగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల కలెక్టరేట్ ముందు ఈ బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదువుతున్న ఎస్సీ ఎస్టీ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలు చేస్తున్న ఈ ప్రభుత్వానికి ఏమి పట్టకుండా నిరక్ష్యంగా ఉందన్నారు. త్వరలో ఈ బెస్ట్ అవైలబుల్ స్కీం పథకం కింద ఉన్న 180 కోట్ల రూపాయల బకాయిను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బిసిల బంద్‌కు సంపూర్ణ మద్దతు

-మేమెంతో మాకంత వాటా కావాలి

- సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షులు సంజీవ నాయక్

చిక్కడపల్లి, అక్టోబరు 15 ప్రభాతవార్త:

బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న బీసీలు తలపెట్టిన బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షులు సంజీవ నాయక్ స్పష్టం చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంజీవ నాయక్ మాట్లాడుతూ... మేమంతో మాకంతా వాటా కావాలని డిమాండ్ చేశారు. ఈడ బ్ల్యుఎస్ రిజర్వేషన్ ఇవ్వడానికి ఎలాంటి అడ్డంకులు లేని కేంద్ర ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్ ఇవ్వడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఏరాష్ట్రం అనుమతి లేకుండానే 143 రాజ్యాంగ సవరణ చేసి ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ అమలు చేశారని విమర్శించారు. 15 శాతం ఉన్న అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి జివో నెంబర్ 9ను తీసుకొచ్చి రాష్ట్ర ప్రభుత్వ బీసీలను మోసం చేసిందని ఎద్దేవా చేశారు. ఇలాంటి సమస్యలు వస్తాయని ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. బీసీలో ఐక్యత లోపించడం వలనే ప్రభుత్వం వివక్షత చూపుతుందన్నారు. బీసీల బంద్కు సకల జనుల మద్దతు లభిస్తుందన్నారు. ఈ బీసీల ఉద్యమం దేశ వ్యాప్తంగా నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఎరుకల సంఘం అధ్యక్షులు కోనేటి నరిసింహా, ఎస్సీ, ఎస్టీ మాజీ కమిషన్ సభ్యులు, ఎలెచ్పీఎస్ అధ్యక్షులు రాంపాల్ నాయక్, ప్రొఫెసర్ అశోక్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు బానోతు హుస్సేన్ నాయక్, ఓయు జేఏసీ నాయకులు డాక్టర్ నెహ్రూ నాయక్, శరత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షులు సంజీవ నాయక్

శుభ్రత డ్రైవ్‌లో జిహెచ్ఎంసి రికార్డు

10 రోజుల్లో 4,185 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు తొలగింపు

హైదరాబాద్, అక్టోబర్ 15, ప్రభాతవార్త:

:నగరంలోని అన్ని 150 వార్డుల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శుభ్రత డ్రైవ్‌లో భాగంగా, జీహెచ్ఎంసీ గత పది రోజుల్లో 4,185 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తొలగించింది. నగరంలో సంవత్సరాలుగా పేరుకుపోయిన దీర్ఘకాలికంగా పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిగా తొలగించడం. ఇందులో మున్సిపల్ ఘన వ్యర్థాలు (ఎంఎస్‌డబ్ల్యూ) , కన్స్ట్రక్షన్ అండ్ డెమలిషన్ (సిఅండ్‌డి) వ్యర్థాలు ఉన్నాయి. ఈ డ్రైవ్ ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల నుండి ఆరు జోన్లలో ఏకకాలంలో కొనసాగుతోంది. అక్టోబర్ 6-15వరకు 2,041 కాలనీలు శుభ్రపరచగా ఎంఎస్‌డబ్ల్యూ వ్యర్థాలు 3,215.25 మెట్రిక్ టన్నులు.. సి డి వ్యర్థాలు970.2 మెట్రిక్ టన్నులు తొలగించారు. ఇందులో చార్మినార్ జోన్ 967 మెట్రిక్ టన్నులతో అగ్రస్థానంలో నిలిచింది. దాని తరువాత ఖైరతాబాద్ (907.4 మెట్రిక్‌టన్నులు ఎల్.బి. నగర్ 551.25 కూకట్‌పల్లి 482.1, సికింద్రాబాద్ 359, శేరిలింగంపల్లి 119.1 జోన్లు ఉన్నాయి. ముఖ్యంగా ప్రతి వార్డు స్థాయిలో వ్యర్థాల నిల్వ ప్రాంతాలను జీపీఎస్ ట్యాగింగ్ ద్వారా మ్యాప్ చేసి, వాహనాల మార్గాలను సక్రమంగా ప్లాన్ చేశారు. ఎంఎస్‌డబ్ల్యూ, సిడి బృందాలు కలసి పనిచేస్తూ, భారీ మలినాల తొలగింపుకు జేసీబీలు, బాబ్‌క్యాట్లు ఉపయోగిస్తున్నారు. ఎలక్ట్రిసిటీ విభాగం సహకారంతో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల దగ్గర భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిరోజూ రియల్‌టైమ్ డిజిటల్ రిపోర్టింగ్, జీపీఎస్ ట్యాగ్ చేసిన ఫోటోలు ఆధారంగా పురోగతిని పర్యవేక్షిస్తున్నారు .హెల్త్, శానిటేషన్ విభాగాల సంయుక్త కమిషనర్లు ప్రతి రోజు సమీక్షలు నిర్వహిస్తున్నారు.

ప్రజలు సానుకూలంగా స్పందిస్తూ, శానిటేషన్ సిబ్బందికి సహకరించడంతో పాటు, అదనపు వ్య ర్థాల నిల్వ ప్రాంతాల సమాచారం అందిస్తున్నారు.

వామ్మో స్వీట్స్...

-ఈగలు,దోమల మధ్యే తయారీ

-గడువు ముగిసిన పదార్థాలు వాడకం

-జిహెచ్ఎంసి పుడ్‌సేఫ్టీ తనిఖీల్లో బయటపడ్డ నిజాలు

హైదరాబాద్, అక్టోబరు 15,ప్రభాతవార్త:

దీపావళి పండుగ సందర్భంగా అందరూ తినే ఐటమ్ ఏదైనా ఉందంటే అది స్వీటే. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఇష్టంగా తినే స్వీట్లను పండుగ సందర్భంగా బల్క్‌గా.. టన్నుల కొద్ది తయారు చేస్తుంటారు. ఈనేపథ్యంలో పలువురు దుకాణదారులు అడ్డదారులు తొక్కుతున్నారు. పండుగను పురస్కరించుకుని నిబంధనలలు పాటించకుండా స్వీట్లు తయారు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు.. బుధవారం43 స్వీట్ షాప్స్ లో తనిఖీలు నిర్వహించి తియ్యని స్వీట్ల తయారీ గురించి చేదు నిజాలు బయట పెట్టారు. మిఠాయి తయారీలో ఎక్స్ పైర్ అయిన ఫుడ్ ఇంగ్రీడియంట్స్ వాడుతున్నట్లు గుర్తించారు. అదే విధంగా ఎలాంటి లేబుల్, ఎక్స్ పైరీ డేట్ లేకుండా అమ్ముతున్నట్లు తెలిపారు. స్వీట్ తయారు చేసే ప్లేస్‌లో ఈగలు, దోమలు ఉన్నట్లు గుర్తించారు. కిచెన్ లో పని చేసే వారు హెడ్ క్యాప్స్, క్లౌజ్, యాప్రాన్స్ వేసుకోవట్లేదని తెలిపారు. స్వీట్స్ లో సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడుతున్నారని తెలిపారు. చాలా షాపులలో, తయారీ కేంద్రాల కిచెన్ లు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. కిచెనఔ లో ఓవెన్ మురికిగా ఉండటం చూసి ఆగ్రహానికి గురయ్యారు. ఇలా నిబందలు పాటించని వారందరికీ నోటీసులు జారీ చేశారు.

చిక్కడపల్లిలో అగ్నిప్రమాదం

చిక్కడపల్లి అక్టోబరు 15 ప్రభాతవార్త:

చిక్కడపల్లి అరోరా పీజీ డిగ్రీ కళాశాల వీధిలో ప్రైవేట్ టెలికాం కేబుల్ వైర్ల షార్ట్‌సర్క్యూట్ కావడంతో బుధవారం రాత్రి భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ప్రమాదం జరిగిన ప్రదేశానికి ఆనుకుని ఉన్న భవనంలో నివసిస్తున్న వారంతా ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. వెంటనే సమాచారాన్ని ముషీరాబాద్ ఫైర్ ఆఫీసర్ చాణక్యకు సమాచారం అందించగా అగ్నిమాపక సిబ్బంది ఇతర ఫైర్ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని భారీగా ఎగిసిపడుతున్న మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కేబుల్‌వైర్ల మూలగానే ప్రమాదం జరిగిందని విద్యుత్తు శాఖ అధికారులు వెల్లడించారు. కాగా ముందు జాగ్రత్తగా సిపిడిసిఎల్ నారాయణగూడ సెక్షన్ ఏఈ సిబ్బందితో అక్కడికి చేరుకుని వెంటనే విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు.

మంటలు ఎగిసి పడుతున్న దృశ్యం

అనుమానాస్పదస్థితిలో గృహిణి ఆత్మహత్య..!

ఉప్పల్, అక్టోబరు 15 ప్రభాతవార్త : అనుమానాస్పదస్థితిలో ఒక గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బందువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ ధర్మపురి కాలనీలో నివసించే స్వప్న అలియాస్ హర్షిణి(40)కు 2005 సంవత్సరంలో వెంకటరమణ(43) అనే వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా గత కొద్ది రోజులుగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో స్వప్న పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. కాగా తమ కుమార్తెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, శరీరంపై సిగరేట్‌తో కాల్చిన గుర్తులు ఉన్నాయని, మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేసేవాడని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. క్రికెట్ కోచ్‌గా పనిచేస్తున్న వెంకటరమణ తీరుపై తమకు అనుమానం ఉందని, హత్య చేసి ఉండవచ్చని మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు పిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒగ్గు కథకు పర్యాయ పదం చుక్కా సత్తయ్య

-సిరికొండ మధుసూదనాచారి

ప్రసంగిస్తున్న తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి

చిక్కడపల్లి, అక్టోబరు 15 ప్రభాతవార్త:

వోగ్గు కథకు పర్యాయ పదం చుక్కా సత్తయ్య తెలంగాణ శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ గడ్డ కళలకు కాణాచి, ఎన్నో కళా రూపాలు వైభవంగా వెలుగు చూసిన నేలపై వోగ్గు కళా రూపం అపురూపం అని అన్నారు. వోగ్గు కథకు పర్యాయ పదం చుక్కా సత్తయ్య అని అయన పేర్కొన్నారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా సంగీత నాట్య వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా చుక్కా సత్తయ్య యాది లో సమావేశం గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా మధుసూదనా చారి పాల్గొని మాట్లాడుతూ అక్షరం ముక్క రాకున్నా జాతీయ అంతర్జాతీయ స్థాయికి వోగ్గు కథను నిలిపిన చుక్కా సత్తయ్య కు పద్మ అవార్డ్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు అయన వుంటే తప్పక దక్కేదన్నారు. విఖ్యాత నటుడు ఎన్‌టీఆర్‌ను కూడా అయన తన ప్రదర్శనతో మెప్పించారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాహితీకిరణం పత్రికా సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, నవ్యనాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, గాయని పులిపాక రమాదేవి పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం సేవలు ఎంతో గొప్పవి : శ్రీలత శోభన్‌రెడ్డి

అబ్దుల్ కలాం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మోతె శోభన్‌రెడ్డి

తార్నాక, అక్టోబర్ 15 ప్రభాతవార్త :

శాస్త్రసాంకేతిక రంగంలో అజరామరమైన సేవలు అందించిన దివంగత భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి సందర్భంగా బుధవారం గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి కలిసి తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ కలాం జీవితం ప్రతి భారతీయ యువతకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. మన దేశాన్ని అణ్వాయుధ రంగంలో స్వావలంబిగా తీర్చిదిద్దిన గొప్ప శాస్త్రవేత్త. ఆయన స్మరణ ప్రతి పౌరునిలో దేశభక్తి భావాన్ని మళ్లీ మేల్కొలపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రవీణ్‌లాల్, డివిజన్ నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొని కలాం సేలను స్మరించుకున్నారు.

నేటి నుంచి 'హాకా దీపావళి టపాసులు విక్రయం' ప్రారంభం

సైఫాబాద్, అక్టోబరు 15 ప్రభాతవార్త:

కొన్ని దశాబ్దాలుగా జంటనగరాలు, శివారు ప్రాంతాలలోని లక్షలాది మంది వినియోగదారులకు విశేషమైన సేవలు అందించిన రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ హాకా (ది హైదరాబాద్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ అసోసియేషన్) దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 16వ తేదీ 21వ తేదీ వరకు ఇందిరా పార్కు ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో 'హాకా దీపావళి టపాకాయల' విక్రయం ప్రారంభిస్తున్నది. వినియోగదారుల సౌకర్యార్థం 6 స్టాల్స్ ఏర్పాటు చేశామని, శివకాశి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన వందలాది రకాల 'స్టాండర్డ్ బ్రాండ్' టపాయకాలను విక్రయించేందుకు అనుభవం కలిగిన ఉద్యోగులను, సిబ్బందిని సిద్ధం చేశామని హాకా బిజినెస్ మేనేజర్ వెంకటరెడ్డి తెలిపారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలుగా అగ్నిమాపక కేంద్రం అధికారులు, పోలీసు అధికారుల నియమ నిబంధనలను పాటిస్తూ జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. వినియోగదారుల సేవలే లక్ష్యంగా హాకా దీపావళి టపాకాయలను ప్రతి ఏడాది విక్రయిస్తున్న మాదిరిగానే ఈ ఏడాది కూడా అతి తక్కువ లాభాలతో విక్రయిస్తున్నామని ఆయన మీడియాకు చెప్పారు. పారి ్కంగ్ సౌకర్యం ఉచితంగా కల్పిస్తున్నామని, ఈ ఏడాది మూడు కోట్లరూపాయల విలువగల టపాకాయలను విక్రయించి, వినియోగదారులకు సేవలు అందించాలనే లక్ష్యంతో ఉన్నామని, 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు 24 గంటల పాటు స్టాల్స్ తెరిచే ఉంటాయిని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలను ప్రభుత్వం అదుకోవాలి

సైఫాబాద్, అక్టోబరు 15 ప్రభాతవార్త: ప్రభుత్వం తక్షణమే అంగన్‌వాడీ టీచర్లకు, అయాలకు రిటైర్డ్ బెనిఫిట్స్‌ను తక్షణమే చెల్లించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందూరి కరుణకుమారి డిమాండ్ చేశారు. ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్స్, ఆయాల పరిస్థితి చాలా దారుణంగా ఉందని, అనారోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యలతో మృత్యు ఒడిలోకి సమీపంలో ఉన్నారని వారిని మానవతా దృక్పథంతో ప్రభుత్వం అదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వారికి చెల్లించాల్సిన టీచర్స్‌కు 2 లక్షలు, ఆయాలకు 50 వేలు వడ్డీతో సహా చెల్లించాలని, పెన్షన్ నెలకు 5వేలు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

నార్సింగి, అక్టోబర్ 15 ప్రభాతవార్త : విద్యుత్ లైన్ల మధ్య మరమత్తుల కారణంగా ఈ క్రింది ఫీడర్ల మధ్య విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని నార్సింగి సెక్షన్ ఏఈ వి.మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డు సబ్‌స్టేషన్ పరిధిలోని 11.కేవీ బాలాజీ నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 8.గంటల నుంచి 11.గంటల వరకు మంచిరేవుల, మంత్రి విల్లాస్, గ్రీన్ ల్యాండ్ అండ్ జైహిందు కాలనీలో కరెంటు సరఫరా ఉండదని వివరించారు. ఇందుకు వినియోగదారులంతా సహకరించాలని ఏఈ మణికంఠ తెలిపారు.

అప్పుల బాధతో ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఆత్మహత్య

నార్సింగి, అక్టోబర్ 15 ప్రభాతవార్త :

అప్పుల బాధలు తట్టుకోలేక మనస్థాపం చెందిన ఓ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ జిల్లా గోల్కొండ మండలం రామ్‌దేవ్‌గూడ ప్రాంతానికి చెందిన రాములు(55) ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్‌గా పని చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల చేసిన అప్పులు తీరే మార్గం లేక నిత్యం ముబావంగా ఉంటూ, తనలో తానే కుమిలిపోతూ కనిపించాడు. ఈ నెల 14.వ,తేదీ ఉదయం 10.గంటల సమయంలో రాములు తన భార్య ఉమారాణితో గొడవ పడ్డాడు. అప్పుడే ఇంటి నుంచి బయటకు వెళ్లి మంచిరేవుల వద్ద ఉన్న ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం స్థానికులు గుర్తించి నార్సింగి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, భార్య ఉమారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు తెలిపారు.

గండిపేట మండలంలో ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

- కలాం ఆశయ సాధనకు కృషి చేయాలని నేతల పిలుపు

మణికొండలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను జరుపుకుంటున్న మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి తదితరుల దృశ్యం

నార్సింగి, అక్టోబర్ 15 ప్రభాతవార్త :

భారత రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను గండిపేట మండలంలోని నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. మణికొండలో మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి నాయకత్వంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం అద్భుతమైన అణు శాస్త్రవేత్త అని, ఆయన వల్లనే నేడు భారతదేశం అణుశక్తితో అగ్రరాజ్యాల సరసన నిలబడగలిగిందన్నారు. రాష్ట్రపతిగా, లెక్చరర్‌గా అనేక పాత్రల్లో అమాంతం ఇమిడిపోయి

హైదర్షాకోట్‌లో కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న బండ్లగూడ కార్పోరేషన్ అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి తదితరులు

భారత జాతికి సేవలు చేశారని వివరించారు. అలాగే హైదర్షాకోట్‌లోని కలాం విగ్రహానికి బండ్లగూడ కార్పోరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు పి.కృష్ణారెడ్డి నాయకత్వంలో పూలమాలలు వేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కటిక పేదరికంలో జన్మించి, అనేక ఇబ్బందులు పడుతూ విద్యను అభ్యసించి, దేశ అత్యుతన్నత పదవులను అధిరోహించిన మహా మనీషి అబ్దుల్ కలాం అన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఎంతో స్ఫూర్తినిస్తుందని, యువత ఆయన వలే కలలు కని, వాటి సాఫల్యతకు శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమాలలో నాయకులు యాలాల నరేష్, శ్రీరాములు, కుమార్, శ్రవణ్, గంగాధర్, దేవేందర్, నాగిరెడ్డి, మధు, శేషు, వేణు, దత్తు, సునీల్, విష్ణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రకుల పక్షపాతి బిజెపి ఓబిసి రిజర్వేషన్‌ల రద్దుకు కుట్ర

సిపిఐ నేత ఇ.టి.నర్సింహ్మా ఆరోపణ

సైఫాబాద్, అక్టోబరు 15 ప్రభాతవార్త: బ్రాహ్మణ, బనియా పార్టీగా పేరొందిన దురహంకార అగ్రకుల పక్షపాతి బిజెపి ఓబిసి రిజర్వేషన్‌లను రద్దుచేసే కుట్రలకు పాల్పడుతున్నదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ్మా ఆరోపించారు. నాటి నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వంలో ఓబిసి రిజర్వేషన్‌లపై మండల్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలనే నిర్ణయాన్ని బిజెపి గట్టిగా వ్యతిరేకించిందని ఆయన ఆరోపించారు. ఓబిసి గుర్తింపు తిరస్కరించడం, కుల ఆధారిత రిజర్వేషన్లను వ్యతిరేకించడంలో సంఘ్ పరివార్ ఆదేశాలను బిజెపి తూచా తెలంగాణలో బిసి రిజర్వేషన్‌లపై ద్వంద వైఖరి ప్రదర్శిస్తున్నదని ఆయన విమర్శించారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన సమితి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్, బిజెపిల చరిత్ర ఎప్పుడు దళితులు, అనగారిన, బలహిన వర్గాల ప్రజలకు వ్యతిరేకంగా ఉంటుందని, అందుకే తెలంగాణలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లను అమలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని ఆయన ధ్వజమెత్తారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షత వహించగా, సమావేశంలో కార్యదర్శి స్టాలిన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి, కౌన్సిల్ సభ్యుడు ఎం.నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇ.టి.నర్సింహ్మా

సమాజానికి సేవచేస్తేనే జీవితానికి సార్థకత : డా. కె.వి.రమణాచారి

నాంపల్లి, అక్టోబరు 15 ప్రభాతవార్త : ఒకజ్యోతి మరెన్నో జ్యోతులను వెలిగించినట్లే సమాజంలో ప్రతీఒక్కరూ చేసే సేవే మరెందరిలోనూ జీవనకాంతులను విరాజిల్లింపజేసి వారి జీవితానికి సార్థకత చేకూరుస్తుందని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి హితవుపలికారు. ప్రముఖ భారత వికాస పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దయెత్తున జరిగిన నిస్సహాయ వితంతువుల పిల్లలైన విద్యార్థులకు ఆర్థిక చేయూతనిచ్చే విద్యావికాస్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రమణాచారి సుప్రసిద్ధ ఆర్థిక ప్రదాత అశ్విని సుబ్బారావు, విశిష్ట అతిథులు హైదరాబాద్ ఉన్నత విద్య సంచాలకురాలు విజయలక్ష్మి, ఏసిపి వై.హరీష్‌కుమార్, కె.సాయిబాబా, వివేకానంద సేవాసమితి ఛైర్మన్ సిహెచ్.హనుమంతరావు, ఎ.జలవేందర్‌రావు, ట్రస్టు కార్యదర్శి సాధన నరసింహాచార్య, నరేంద్రకృష్ణ, చైతన్య, సుధ తదితరులతో కలిసి వితంతువుల పిల్లలైన నిస్సహాయ 115మంది అభాగ్య విద్యార్థులకు విద్యావికాస్ స్కాలర్‌షిప్ కింద ఒక్కొక్కరికి 5వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసి శుభాశీస్సులు తెలిపారు. ట్రస్ట్ ఛైర్మన్ అశ్విని సుబ్బారావు తమన సంస్థ ఆధ్వర్యంలో దాతలు, శ్రేయోభిలాషుల సహకారంతో గత సంవత్సరం 300,ఈ సంవత్సరం 600మంది అభాగ్య విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఏసిపి హరీష్‌కుమార్ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా విద్య, సమాజహితం కోసం దీక్షబూనాలని సూచించారు.

వితంతువుల పిల్లలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న రమణాచారి, విజయలక్ష్మి, హనుమంతరావు, సాయిబాబా, నర్సింహాచారి తదితర అతిథులు

అంధుల సమస్యల విషయంలో సిఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలి

సైఫాబాద్, అక్టోబరు 15 ప్రభాతవార్త: రాష్ట్రంలోని అంధుల సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే రిటైర్డ్ ఐఎఎస్‌తో గాని, రిటైర్డ్ జడ్జితోగాని స్వయం ప్రతిపత్తి కలిగిన కమిషనర్‌ను నియమించాలని తెలంగాణ అంధుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. అంధుల విషయంలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో త్వరలో కార్యచరణ కార్యక్రమాన్ని ప్రకటిస్తామని నాయకులు హెచ్చరించారు. అంతర్జాతీయ వైట్ కేన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చోక్కారావు, జి.అంజయ్యగౌడ్ తదితరులు మాట్లాడుతూ పదవి వరమణ చేసిన అంధ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను తక్షణమే చెల్లించాలని, అంధుల కోసం బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించడానికి ఒక కమిటిని నియమించి భర్తీ చేయాలని, విద్యా పరమైన అర్హత ప్రకారం కాకుండా 100 శాతం అంధత్వం ఉన్న వారికే మొదటి ప్రాధాన్యత ఇచ్చి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుతం అంధులకు సంబంధించిన అన్ని ప్రయోజనాలను తక్కువ శాతం అంధత్వం ఉన్నవారు పోందుతున్నారని ఆరోపించారు. అంధుల సమాజం కోసం పనిచేస్తున్న అంధుల పాఠశాలలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలని, మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల ఏర్పాటుకు 50 లక్షలు కేటాయించిన ప్రభుత్వం అంధుల పాఠశాలలు, అంధుల సంస్థలు, వికలాంగుల కోసం పనిచేస్తున్న అన్ని ఎన్జీఓలకు గ్రాంటు మంజూరు చేయాలని, అన్ని బస్‌లలో అంధులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు ఎన్. పరమేష్, అజిత్‌కుమార్, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చోక్కారావు

గాంధీనగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారం : పరమేశ్వర్‌రెడ్డి

గాంధీనగర్‌లో డ్రైనేజీ సమస్య పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

రామంతాపూర్, అక్టోబరు 15 ప్రభాతవార్త :

రామంతాపూర్ గాంధీనగర్ మల్టీ ఫంక్షన్ హాల్లో సమీపంలో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ ఆధ్వర్యంలో పలువురు అధికారులతో కలిసి సమస్య పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గాంధీనగర్ మల్టీ ఫంక్షన్ హాల్ వద్ద డ్రైనేజీ సమస్య ఇక్కడి కాలనీవాసులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని, ఫంక్షన్ హాల్‌ను నిర్మించి దానికి సరైన అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. డ్రైనేజీ సమస్యను రామంతాపూర్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎండి.రఫిక్ తన దృష్టికి తీసుకుని రావడంతో స్పందించి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. డ్రైనేజీ సమస్య వెంటనే పరిష్కరించాలని జలమండలి డిజిఎం రజినీకాంత్ రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘం నేతలు మహమ్మద్ రఫీక్, గాంధీనగర్ అధ్యక్షులు మొగిలి లింగం, పబ్బు గంగాధర్, రమేష్ బిక్షపతి, సిద్ధిరాములు, అశోక్, గట్టయ్య, శంకరాచారి, నరసింహ, జహంగీర్, నరేష్, సయ్యద్, మహ్మద్ నయిమ్ వల్లపు శ్రీకాంత్‌యాదవ్, సందీప్, భాస్కర్, బుల్లెట్ అశోక్ పాల్గొన్నారు.

పెండింగ్ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి,అక్టోబరు 15 ప్రభాతవార్త :

పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.బాలాజినగర్,లక్ష్మీగూడ బృందావన్ కాలనీలో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు.పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్లు,భూగర్భ డ్రైనేజీ పనులు,బృందావన్ కాలనీలోని పుల్లిగుట్ట నాలా పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో డివిజన్ బిజెపి అధ్యక్షులు సాందు యాదవ్,డివిజన్ మాజీ అధ్యక్షులు అడికే జనార్దన్,బిజెపి నాయకులు హనుమంత్ రెడ్డి,అడికే శివ,ధనరాజ్.ధన్‌రాజ్, సతీష్,రంజిత్‌సింగ్,రజనీ కాంత్,శ్రీ కాంత్ రెడ్డి,అనిల్ రాజు,శంకర్ రెడ్డితో పాటు బస్తీ వాసులు పాల్గొన్నారు.

పోషణ పక్షం ..ఆరోగ్య లక్ష్యం

అత్తాపూర్ అక్టోబరు15,ప్రభాతవార్త :

చిన్నారులు,గర్భిణులు,బాలింతలు పోషకాహారం లోపాన్ని అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతంగా మారేలా పోషణ పక్షం ..ఆరోగ్య లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఐపిడిఎస్ సూపర్ వైజర్ ఉమారాణి పేర్కొన్నారు.బుధవారం రాజేంద్రనగర్ ఉన్నత పాఠశాలలో పోషణ పక్షం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్వైజర్ ఉమా రాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుగుణ ,పలువురు అధికారులు హాజరై మాట్లాడారు... కిశోర బాలికలకు రక్తహీనత, పరిశుభ్రత, సమతుల ఆహారం గురించి అవగాహన కల్పించారు. ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, గుడ్లు, పాలు వంటి పౌష్టిక ఆహారం తీసుకోవాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా సహజ శ్రేయస్సుకు దోహదపడాలనే ఉద్దేశ్యంతో ఆరోగ్య తెలంగాణ లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పోషణ పక్షోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు.అనంతరం పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఎస్. లక్ష్మి,లలిత, ఎం. సంగీత, బస్తీ దవాఖాన డాక్టర్ వినీత్, ఆశా వర్కర్లు మీనా, టీచర్లు, గర్భిణీలు, బాలింతలు, విద్యార్థులు,పాల్గొన్నారు.

పాతబస్తీలో మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన ఆటో డ్రైవర్ అరెస్ట్

చార్మినార్,అక్టోబరు 15 ప్రభాతవార్త : పదకొండు ఏళ్ల బాలికకు మాయ మాటలు చెప్పి కిడ్నాప్ చేసిన ఓ ఆటో డ్రైవర్‌ను మీర్‌చౌక్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ కథనంప్రకారం.... మొగల్‌పుర ప్రాంతానికి చెందిన పదకొండు ఏళ్ల బాలిక ఓ ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుచున్నది.మంగళవారం సాయంత్రం బాలిక పాఠశాల నుంచి ఇంటికి ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్నది.ఇది గమనించిన రెయిన్‌బజార్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ షబ్బీర్ (36) మీ నాన్న ఆటోలో నిన్ను ఇంటికి తీసుకు రమ్మన్నాడని బాలికకు మాయ మాటలు చెప్పాడు.బాలికతో పాటు బాలుడిని కూడ ఆటోలో ఎక్కించాడు.కొంత దూరం ఆటో వెళ్లిన తర్వాత ఆటో నుంచి బాలుడిని దింపేశాడు.బాలికను ఆటోలో తీసుకుని ఆటోడ్రైవర్ మలక్‌పేట్ వైపు వెళ్తూ మధ్యలో ఆటో నిలిపి బాలికపై అత్యాచారానికి యత్నించాడు.బాలిక భయంతోఆటో నుంచి కిందికి దూకి పారి పోయింది.స్థానికులు ఆటో డ్రైవర్ షబ్బీర్‌ను చితక బాది మీర్‌చౌక్ పోలీసులకు అప్పగించారు.ఆటో డ్రైవర్ షబ్బీర్‌పై కిడ్నాప్,ఫోక్సో చట్టం కిద కేసులు నమోదు చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ తెలిపారు.ఈ కేసును మీర్‌చౌక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పశువులకు తప్పనిసరి గాలికుంటు టీకాలు వేయించండి : ఏడి సుభాష్

కొత్తూరు, అక్టోబర్ 15, ప్రభాతవార్త:

కొత్తూరు మండలంలో 343 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పశువుల ఆరోగ్యం కాపాడేందుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం ప్రతి రైతు బాధ్యతగా భావించాలన్నారు పశుసంవర్ధక విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుభాష్. గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం కొత్తూరు మండలంలోని ఎస్.బి.పల్లి, ఇమ్మున నర్వ గ్రామాల్లో పశువైద్య సిబ్బంది ఆధ్వర్యంలో టీకాలు వేశారు. మొత్తం 343 పశువులకు టీకాలు వేసినట్లు డాక్టర్ సుభాష్ తెలిపారు. కొత్తూరు మున్సిపాలిటీలోని కొత్తూరు తండాలో కౌన్సిలర్ సోమ్లా నాయక్, డాక్టర్ స్ఫూర్తి పాల్గొని పశువులకు టీకాలు వేయించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుభాష్ ఆకస్మికంగా తనిఖీ చేసి, పశువైద్య సిబ్బందిని అభినందించారు. రైతులు తమ పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రవి,హేమంత్, రైతులు హర్య,తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పై గుంతలను పూడ్చేందుకు మట్టికి అనుమతులు ఇవ్వండి

కేశంపేట అక్టోబర్ 15 ప్రభాతవార్త

కేశంపేట మండల పరిధిలోని సంతపూర్ గ్రామం నుండి చౌలపల్లి గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు గత కొన్ని రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు గుంతల మాయంగా మారి ప్రయాణించడానికి ఇబ్బందిగా ఉన్నదున సొంత నిధులతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టడానికి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నేత సాజిత్ మట్టి తెచ్చుకోవడానికి అనుమతి ఇవ్వాలని తాసిల్దార్ రాజేందర్ రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. రోడ్డు అధ్వానంగా తయారు కావడంతో 80,000 ఖర్చు చేసి రహదారిపై మట్టి పోసి రైతుల రాకపోకలు సులభతరం అయ్యేలా చర్యలు తీసుకునేందుకు నడుం బిగించారు.ఈ విషయ పై తాసిల్దార్ కు మట్టి పోయటానికి కొత్తచెరువు నుండి మట్టి తీసుకునేందుకు అనుమతి మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. గ్రామ అభివృద్ధి కోసం యువత ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు చేయడం పట్ల గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్ర

అవినీతి లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు రవికుమార్

కర్రేటి విజయరెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జిలుకర రవికుమార్

ముషీరాబాద్, అక్టోబర్ 15, ప్రభాతవార్త: అవినీతి లేని తెలంగాన నిర్మాణమే తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జిలుకర రవికుమార్ వెల్లడించారు. బుధవారం విశ్రాంత ఐఏఎస్ అధికారి కూనపురెడ్డి హరిప్రసాద్‌తో కలసి ఏర్పాటు చేసిన సమావేశంలో సామాజిక కార్యకర్త కర్రేటి విజయరెడ్డి టిపిఆర్‌పీలో చేరారు. ఆమెకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం రవికుమార్ మాట్లాడుతూ ప్రజారాజ్యం పార్టీని బలోపేతం చేయటమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కొత్త రాజకీయ చైతన్యం కోసం ఈనెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలో రథయాత్ర నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని, రాష్ట్రంలోని 5763 ఎంపీటీసీలకు, 566 జెడ్‌పీటీసీలకు, 12,760 గ్రామ పంచాయితీ స్థానాలలో తమ పార్టీ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. టిక్కెట్ల కేటాయింపులో యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని, బీసీలకు 42శాతం టిక్కెట్లు కేటాయిస్తామని తెలిపారు. సుప్రీంకోర్టు బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా తీర్పు ఇచ్చి, హైకోర్టు స్టేను వికెట్ చేయించాలని వారు విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి,బండి సంజయ్‌లు రాష్ట్ర గవర్నర్ బీసీ రిజర్వేషన్ల జీవో 9ను ఆమోదించే విధంగా ఒత్తిడి తేవాలని కోరారు. మహాత్మా జ్యోతిరావు పూలే, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసిన అనంతరం నగరంలో రథయాత్రను ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి - అదనపు డిసిపి అశోక్

రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో డ్రగ్స్, ఆన్‌లైన్ పెట్టింగ్‌లపై నిర్వహించిన అవగాహన సదస్సులో అడిషనల్ డిసిపి అశోక్, ఏసిపి సుబ్బయ్య తదితరులు

అడ్డగుట్ట,అక్టోబర్ 15 ప్రభాతవార్త: గంజాయి,డ్రగ్స్,మాదకద్రవ్యాలను విక్రయించినా, కొనుగోలు చేసిన చర్యలు తప్పదని ఉత్తర మండలం అడిషనల్ డిసిపి పగడాల అశోక్ తెలిపారు. మంగళవారం రాత్రి రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో సైబర్ క్రైం,అన్‌లైన్ బెట్టింగ్, డ్రగ్స్,గంజాయిలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆన్‌లైన్ యాప్‌ల పెట్టింగ్‌లపై ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలు, గంజాయిలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా వాటిని విక్రయిస్తే 100, 1930 నెంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై మోసపోతున్న వివిధ అంశాలపై స్క్రీన్ ప్లే ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఏసిపి సుబ్బయ్య, డిఐ శ్రీనివాస్,ఎస్ఐలు యశోదర్, రామకృష్ణ, కిరణ్ కుమార్, రమ్య, బస్తీ నాయకులు పి.నర్సింగ్ రావ్, శ్రీనివాస్ ముదిరాజ్, చిన్న వీరయ్య, పరశరామ్, కె.బాబు, బాలనర్సింహ్మ, కోటయ్య, ఎస్.రాము, రౌతు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్షణ శాఖ స్థలాలపై రూ. 303 కోట్లు నిధులు రావడం శుభదినం : బానుక

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బానుక నర్మధ

కంటోన్మెంట్,అక్టోబర్ 15 ప్రభాతవార్త: ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం రక్షణ శాఖ స్థలాలకు వచ్చిన రూ.303 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జమ చేయడం శుభదినమని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ తెలిపారు. బుధవారం బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నర్మధ మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు రూ.303 కోట్ల రూపాయలు అందించడానికి కృషి చేసిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్,మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి,కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌లకు అభినందనలు తెలిపారు. ఈ నిధులతో కంటోన్మెంట్ బోర్డు పరిధిలో మౌళిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని ఆమె తెలిపారు.

నిస్వార్థ రాజకీయాలకు చిరునామా అబ్దుల్ కలాం

అబ్దుల్ కలాంకు నివాళులు అర్పిస్తున్న దాసి నాగరాజు

నిజాంపేట్, అక్టోబర్ 15, ప్రభాతవార్త

భారతరత్న డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం నిస్వార్థ రాజకీయాలకు చిరునామా అని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ దాసి నాగరాజు తెలిపారు. మాజీ భారత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిజాంపేట లోని వారి కార్యాలయంలో డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసి నాగరాజు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో స్ఫూర్తిదాయకమైన వ్యక్తిత్వం కలవారని అన్నారు. అబ్దుల్ కలాం ఒక శాస్త్రవేత్తగా, రక్షణ పరిశోధన, అంతరిక్ష రంగాల్లో విశిష్టమైన కృషి చేశారని భారతదేశాన్ని అణుశక్తి కలిగిన దేశంగా మలచడంలో ఆయన పాత్ర అపూర్వమని తెలిపారు. అందుకే ఆయనను మిస్సైల్ మాన్ ఆఫ్ ఇండియా అని సగర్వంగా పిలుస్తారన్నారు. బిజెపి అధ్యర్యంలో రాష్ట్రపతిగా కూడా ఆయన విశిష్టమైన సేవలను అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కారుణ్య వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ కిరణ్, కమలాకర్ ప్రతినిదులు సందీప్, ప్రవీణ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

వెండి తెర అమ్మ అన్నపూర్ణ : పద్మశ్రీ డాక్టర్ శోభా రాజు

చిక్కడపల్లి, అక్టోబరు 15 ప్రభాతవార్త: తెలుగు సినిమాలలో గతం లో కన్నాంబ, ఋష్యేంద్రమణి, తరువాతి కాలంలో అంజలీ దేవి వెండి తెర అమ్మ లు కాగా నేడు అమ్మ,వదిన పాత్రలలో అన్నపూర్ణ రాణిస్తున్నారు అని అన్నమాచార్య భావనా వాహిని అధినేత్రి, పద్మశ్రీ డాక్టర్ శోభా రాజు అన్నారు. బుధవారం అభినందన సాంస్కృతిక, సామాజిక, సేవా సంస్థ స్థాపకురాలు డాక్టర్ ఇ.భవాని ఆధ్వర్యంలో సుప్రసిద్ధ సినీనటులు డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని 'అభినందన' అక్కినేని పురస్కారం'ను సినిమాలకే అమ్మగా పేరుపొందిన ప్రముఖ నటీమణి అన్నపూర్ణకు ప్రదానోత్సవ సభ చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో ఎపి అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు పి.విజయబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా డాక్టర్ శోభరాజు చేతులమీదుగా పురస్కారాన్ని అన్నపూర్ణకు అందించిన అనంతరం ప్రసంగించారు. జీవితం సంపూర్ణం గా అర్థం చేసుకున్న సంపూర్ణ మానవుడు అక్కినేని అన్నారు అక్కినేని ప్రతి సినిమా ఒక పాఠం అన్నారు. పి.విజయబాబు మాట్లాడుతూ అక్కినేని నాలిక ను జయించారనీ అందుకే ఆయన సంపూర్ణ జీవితం గడిపారు అని చెప్పారు కాన్సర్ వచ్చింది అని ధైర్యం గా తన మరణం కు నెల రోజుల ముందు చెప్పినఅసలైన హీరో అక్కినేని అన్నారు అన్న

ప్రముఖ నటీమణి అన్నపూర్ణకు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న పద్మశ్రీ డాక్టర్ శోభా రాజు

పూర్ణ విలక్షణ నటి సహజత్వం నటన చూపే అన్నపూర్ణ ఉత్తమ వ్యక్తితం అని అభినందించారు. అన్నపూర్ణ మాట్లాడుతూ అక్కినేని అంటే దేవదాసు, కాలి దాసు, మాత్రమే కాదు లవర్ బాయ్ కూడా ఆయన అవార్డ్ అందుకోవడం సంతోషం అన్నారు. కార్యక్రమంలో సుప్రసిద్ధ ఆధ్యాత్మిక రచయిత్రి డాక్టర్ కె.వి.కృష్ణకుమారి, జివిఎన్.రాజు, సుంగమం సంజయ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు. అక్కినేని నటించిన చిత్రాలకు సంబంధించిన క్లిప్పింగ్స్ ప్రదర్శన నిర్వహించగా, ఏఎన్నార్ నటించిన చిత్రాల నుంచి గీతాలను నండూరి లక్ష్మణ్‌రావు, శిశివదన గానం జరగ్గా, రాధికా శ్రీనివాస్ శిష్యబృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యప్రదర్శన అద్భుతంగా సాగింది.

శాస్త్ర, సాంకేతిక అభివృద్ధికి అధ్యయనాలు కీలకం

- జాతీయ విజ్ఞాన సాంకేతిక సదస్సులో డాక్టర్ అరవింద్ కుమార్

జూబ్లీహిల్స్, అక్టోబరు 15, ప్రభాతవార్త: సమగ్ర శాస్త్ర, సాంకేతిక అభివృద్ధికి అధ్యయనాలు ఎంతో కీలకమని ఎన్ఎస్‌టీఎంఐఎస్, విజ్ఞాన సాంకేతిక శాఖ సలహాదారులు డాక్టర్ అరవింద్ కుమార్ అన్నారు. భారత ప్రభుత్వ విజ్ఞాన సాంకేతిక శాఖ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కీ) ఆధ్వర్యంలో జాతీయ విజ్ఞాన సాంకేతిక సర్వే 2024-25పై బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమ, పరిధోన సంస్థల నుండి విశేషమైన స్పందన లభించడం ఈ రెండు రంగాల మధ్య పెరుగుతున్న సహకారానికి నిదర్శనమన్నారు. దేశంలో విజ్ఞాన సాంకేతిక సామర్థ్యాన్ని అంచనా వేయడం, డేటాను సమర్థవంతమైన విధాన నిర్ణయాలకు వినియోగించడం ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ జాతీయ సర్వే ఒక సమగ్ర పరిశీలన కార్యక్రమం అన్నారు. ఈ సర్వే ఫలితాలు 21 కీలక సూచికలపై వివరణాత్మక నివేదికల రూపంలో రూపొందించబడుతాయన్నారు. ఈ

సదస్సులో మాట్లాడుతున్న అరవింద్‌కుమార్, చిత్రంలో పలువురు ప్రతినిధులు ఉన్నారు.

సమాచారాన్ని యునెస్కో తదితర అంతర్జాతీయ సంస్థలతో పంచుకుంటారన్నారు. దేశంలో పరిశోధన, అభివృద్ధి ఫలాలు పదేళ్లలో రెట్టింపు అయ్యాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ రోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరక్టర్ రాధాకిషోర్ పాండ్రంగి, శాస్త్రవేత్త రబీంద్ర కుమార్ పాణిగ్రహి, మాజీ శాస్త్రవేత్త డాక్టర్ అరబింద మిత్రా, బీడీఎల్ స్ట్రాటజిక్ విభాగ అదనపు జీఎం అరుణ్‌కుమార్, ఫిక్కి తెలంగాణ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు దృవ్ గుప్తా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత : డిసిపి వేణుగోపాల్‌రెడ్డి

సికింద్రాబాద్ ఎస్.వి.ఐటీ కళాశాలలో రోడ్డు భద్రతల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ అదనపు డిసిపి వేణుగోపాల్‌రెడ్డి, పి.ఎల్.శ్రీనివాస్ తదితరులు

కంటోన్మెంట్,అక్టోబర్ 15 ప్రభాతవార్త:

రోడ్డు ప్రమాదాల నివారణకుడ్రైవర్లు రోడ్డు భద్రతా సూత్రాలను పాటించాలని ట్రాఫిక్ అడిషనల్ డిసిపి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ ప్యాట్నీ చౌరస్తాలోని ఎస్.వి.ఐటీ.కళాశాలలో రోడ్డు భద్రత,రోడ్డు ప్రమాదాల నివారణ పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తీసుకోవాల్సిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వాహన చోదకులు దారులు తప్పని సరిగా హెల్మెట్,సీట్ బెల్ట్‌లు ధరించాలన్నారు మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పని సరిగా పాటించాలన్నారు. అతివేగంతో ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ కళాశాల విద్యాసంస్థల కార్యదర్శి పి.ఎల్.శ్రీనివాస్, అకాడమి కడీన్ రఘురామ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగంతం చేయాలి : కొంతం దీపిక

ఎల్.శంకర్ నగర్‌లో నాలా పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

కంటోన్మెంట్,అక్టోబర్ 15 ప్రభాతవార్త:

మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లి ఎల్.శంకర్ నగర్‌లో కొనసాగుతున్న నాలా పైప్‌లైన్ నిర్మాణం పనులను ఆమె పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ చంద్రశేఖర్, జలమండలి డిజిఎం విద్యాసాగర్, బిజెపి నాయకులు జిత్తూ, ప్రశాంత్, బస్తీ పెద్దలు రేఖా,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అడిక్‌మెట్ డివిజన్ స్మశానంలో క్లీన్ అండ్ గ్రీన్

-చెత్త మట్టి కుప్పలు, వ్యర్థల తొలగింపు

అడిక్‌మెట్‌లో స్మశానవాటికలో పేర్కొనిపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది, పర్యక్షిస్తున్న బిజెపి అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్, డిఇ సన్నీ తదితరులు

చిక్కడపల్లి, అక్టోబరు 15 ప్రభాతవార్త:

దీపావళి పండుగను పురస్కరించుకొని అడిక్‌మెట్ డివిజన్ లోని అంజయ్య నగర్, వడ్డెర బస్తి, అంబర్ నగర్ స్మశాన వాటికల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి, వ్యర్థ మొక్కలను జిహెచ్ఎంసి సర్కిల్ అధికారులు ముషీరాబాద్ సర్కిల్ అధికారులు బుధవారం తొలగించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం డిఈ సన్నీ, ఏఈ విశ్వేశ్, బిజెపి అడిక్‌మెట్ అధ్యక్షులు పాశం సాయి కృష్ణ యాదవ్ పాల్గొని పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డిఈ సన్నీ మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరము కూడా స్మశాన వాటికల క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. పాశం సాయి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ డివిజన్ లోని అన్ని స్మశాన వాటికలో క్లీన్ అండ్ గ్రీన్ తో పాటు లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. డివిజన్లో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పూడ్చాలని సూచించారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వి. కిషోర్, అరవింద్, రాజు జిహెచ్ఎంసి అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

టేకుమట్ల గ్రామ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, అక్టోబరు 15 ప్రభాతవార్త: టేకుమట్ల గ్రామ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం బుధవారం నగరంలోని మిత్ర మినీ హాల్ లో ఉత్సాహ భరిత వాతావరణం లో జరిగింది. వివిధ రంగలలో స్థిరపడి తదుపరి విశ్రాంత జీవనం గడుపుతున్న సుమారు వంద మంది పైగా పాల్గొని టేకుమట్ల జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రొఫెసర్ ఉప్పు సత్యయ్యను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య ప్రాధాన్యత ప్రతి వారూ నేటి తరానికి తెలిపి సమాజానికి మంచి పౌరులను అందించాలి అని చెప్పారు క్రమ శిక్షణ అంకిత భావం ఉంటే లక్ష్యాలు సాధించవచ్చు అని చెప్పారు కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వెంకట రత్నం,యువ కళా వాహిని ఉపాధ్యక్షుడు ఏం ఏ హమీద్ , ముత్తయ్య వెంకటేశ్వర్లు దుర్గం వెంకట రత్నం తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని చట్టం చేయాలి

-టిజెఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ శీనివాస్ యాదవ్

చిక్కడపల్లి, అక్టోబరు 15 ప్రభాతవార్త: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అంశాన్ని చట్టం చేయాలని తెలంగాణ జనసమితి ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెరుగు శ్రీనివాస్‌యాదవవ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు పెట్టి బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న బీసీ సంఘాలు జేఏసీ ఆధ్వర్యంలో జరిగే తెలంగాణ బంద్ పిలుపుకు మద్దతు తెలుపుతూ నగర వ్యాప్తంగా అందరూ రావాలని పిలుపుని ఇస్తున్నాం కావున అందరూ

గాంధీనగర్ డివిజన్ జన సమితి విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న టిజెఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ మేరుగు శ్రీనివాస్ యాదవ్

మద్దతు ఇవ్వాలని కోరుతున్నాం... గాంధీ నగర్ డివిజన్ అధ్యక్షులు గుండెల్లి రవీందర్ యాదవ్, సత్యనారాయణ, వెంకటేష్ వీరేశం కూడా పాల్గొన్నారు.

తెలంగాణ జానపద కళలు సాంస్కృతిక జీవనాడి : మడుగు విజయ్‌కుమార్

సైఫాబాద్, అక్టోబరు 15 ప్రభాతవార్త:

తెలంగాణ జానపద కళల మన సమాజపు సాంస్కృతిక జీవనాడి అని, అవి స్థానిక భాష సాంస్కృతిక పరిరక్షణకు గ్రామీణుల జీవనశైలీకి అద్దం పడతాయని బిజెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డా. మడుగు విజయ్ కుమార్ చెప్పారు. ఈ కళలను పునరుద్ధరించడం ద్వారా కొత్త తరానికి మన మూలాలను గుర్తు చేసినట్లువుతుందన్నారు. నారాయణగూడలోని బిజెఆర్ ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సిపి బ్రౌన్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం 'తెలంగాణ జానపద కళల పునర్జీవనం-సమాలోచన' అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతి, జీవనవిధానం, భావోద్వేగాలు, విలువలు తరతరాలకు సంక్రమిస్తాయని, యక్షగాణాలు, బుర్రకథలు, హరికథలు, తోలు బొమ్మలాటలు, కోలాటాలు, బతుకమ్మలాట, గంగిరెద్దులాట లాంటి ఆనేక అంశాల గురించి వివరించారు. కాలేజీ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బాల భాస్కర్ మాట్లాడుతూ ఇలాంటి జానపదాలను ముందు తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జయరాజ్. వేదికపైన ప్రొఫెసర్లు, ప్రముఖులు ఉన్నారు

కళాశాల ఉన్నత విద్యా సంయుక్త సంచాలకులు ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్ జానపద కళల విశేషాల గురించి వివరించారు. ప్రముఖ ప్రజా గాయకుడు జయరాజ్ మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న సామాజిక అంశాలను గురించి, అలాగే వృక్షం గురించి అద్భుతంగా పాట వినిపించారు. ఈ సదస్సులో ప్రపంచంలోని అమెరికా, జర్మనీ, రష్యా తదితర దేశాల నుంచే కాకుండా తెలుగు రాష్ట్రాల నుంచి ఆనేక కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సుకు సమన్వయ కర్తలుగా డా.రాపోలు శ్రీనివాస్, డా.ఎన్.దీపిక, డా.సివిఎల్ నారాయణ ముఖ్య పాత్ర వహించారు.

దేశ రక్షణ అంతరిక్ష ప్రయోగాల రూపకర్త అబ్దుల్‌కలాం

- తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి

రవీంద్రభారతి, అక్టోబరు 15 ప్రభాతవార్త :

భారతదేశ అంతరిక్ష ప్రయోగాలకు, రక్షణలకు ఎంతగానో కృషిచేసిన భారత పూర్వ రాష్ట్రపతి భారతరత్న ఏపిజె అబ్దుల్ కలామ్ అని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు, తెలంగాణ తొలి శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్.ఆర్.ఆర్.చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఏపిజె అబ్దుల్‌కలాం జయంతి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిరికొండ మధుసూదనాచారి విశిష్ట అతిథులు లోక్‌దళ్ పార్టీ అధ్యక్షుడు కపిలవాయి దిలీప్‌కుమార్ డా. ఎం.రామమోహన రావు, ఉప్పల శ్రీనివాసగుప్త, కె.మురళీమోహన్‌రాజు, డా. ఎస్.రామచంద్రరావు, డా. రాధాకుసుమ, పలువురు

అబ్దుల్‌కలామ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పిస్తున్న మధుసూదనాచారి, శ్రీనివాసగుప్త, మురళీమోహన్‌రాజు, రాధాకుసుమ తదితర అతిథులు

కవులు, కళాకారులతో కలిసి ముందుగా అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించారు. అనంతరం గంగాధర్‌రెడ్డి, డా. అమాంచ అంజయ్య, లయన్ సాధుకృష్ణ కిషోర్, అనురుద్రారెడ్డి, సొంటి శ్రీనివాస్, లయన్ డా. డి.చక్రధర్, జి.గురుప్రకాష్, డా. ఎంఎస్‌కె.షా, అలియాభాను, ఎం.వెంకటేశ్వర్లు, షేక్‌ముబీ నాలను ఘనంగా సత్కరించి అబ్దుల్ కలామ్ స్ఫూర్తి అవార్డులను ప్రదానం చేసి అభినందించారు.

గాంధీనగర్ డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి కృషి

-కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, అక్టోబరు 15 ప్రభాతవార్త:

గాంధీనగర్ డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించడం జరుగుతుందని స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని వివేకనగర్ పీపుల్స్ పార్క్‌లో చేపట్టిన పనులను పర్యవేక్షించారు.పార్క్ చుట్టూ కాంపౌండ్ వాల్, పెయింటింగ్,లైట్ల ఏర్పాట్లు తదితర పనులను త్వరలో పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు.డివిజన్ లోని అన్ని పార్కులను సుందరికరించేందుకు కావలిసిన ఏర్పాట్లు పూర్తి చేశామని,సీనియర్ సిటిజన్లకు,పిల్లలకు మరియు స్థానికులకు పార్కుల ద్వారా స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్

గాంధీనగర్‌లో పార్కు అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న స్థానిక కార్పొరేటర్ పావనీ వినయకుమార్

పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బిజెపి నేతలు పి.నర్సింగ్ రావు, ప్రశాంత్, పీపుల్స్ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రేమ్ కుమార్,గణేష్, ఆంజనేయులు,సుబ్బారావు, జితేందర్,లింగరాజ్, రామ చెందర్,రజినీకాంత్ పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బిసి బిల్లు ప్రవేశపెట్టి అమోదించాలి

అభివాదం తెలుపుతున్న ఆళ్ల రామకృష్ణ, నరేందర్‌గౌడ్ తదితరులు

సైఫాబాద్, అక్టోబరు 15 ప్రభాతవార్త:

వచ్చే శీతకాల పార్లమెంట్ సమావేశాల్లో బిసిలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్‌ల కోసం 9వ షెడ్యూల్డ్‌లో చేర్చి రాజ్యాంగ సవరణ చేయాలని జాతీయ ఓబిసి మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆళ్ళ రామకృష్ణ, తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్రపతి అమోదముద్రతోనే రిజర్వేషన్‌ల బిల్లుకు సార్థకత లభిస్తుందన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రిజర్వేషన్ సాధన కోసం ఈ నెల 23న 'చలో రాజ్‌భవన్ ముట్టడి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, 25న ప్రజా సంఘాలు, బిసి సంఘాలు, ఎస్సీ, ఎస్టీ సంఘాలతో భవిష్యత్తు

సమాజానికి తమ వంతు సేవలు : అంజనీకుమారి

పీవీపీ అంజనీ కుమారుని సన్మానిస్తున్న నిర్వాహకులు

మలక్ పేట ,అక్టోబర్ 15, ప్రభాతవార్త:
సమాజానికి తమ వంతు సేవలు అందిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర సి ఎస్సి కోర్టు సూపరింటెండెంట్ పివిపి అంజనీకుమారి పేర్కొన్నారు. వావ్ మ్యూజిక్ అధినేత పి.వి లక్ష్మి, యువ తేజం ట్రస్ట్ ఫౌండర్ ఎస్. కే.కరీముల్లా, కలాం విజన్ సంయుక్తఆధ్వర్యంలో జాతీయ కవి సమ్మేళనం, కూచిపూడి నృత్యం , సంగీత విభావరి తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేకమంది సాహితీ వేత్తలు, కవులు , పాల్గొన్నారు, ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతిగా ప్రముఖ సాహిత్య వేత్త, కవి, విశ్లేషకులు జ్యోతిబాయ్ పూలే విద్యాలయ ప్రిన్సిపల్ డాక్టర్ సి. నారాయణస్వామి సభాధ్యక్షులుగా వ్యాఖ్యాతగా వ్యవహరించగా,కవి సమ్మేళనంలో ముగ్గురు ప్రముఖ కవులు నారాయణ స్వామి, డాక్టర్ రాధా కుసుమ, కేశవరాజు వెంకట ప్రభాకర్ రావు లకు ఖిఖికాళోజిఖిఖినారాయణరావు పేరిట నంది పురస్కారము 20 25 లను అందజేశారు . అదేవిధంగా సమాజానికి తమ వంతు సేవలు అందిస్తూ విద్యార్థులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తున్న పివిపి ఆంజనీ కుమారికి సావిత్రిబాయి పూలే నంది పురస్కారం 2025 ను అందజేశారు. మరొక సామాజికవేత్త కరిముల్లా, రాధా శేఖర్, శోభా నాయుడు తదితరులు అబ్దుల్ కలాం ,నంది పురస్కరాలను అందుకున్నారు.

యూత్ పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్లపై చైతన్యభరిత చర్చ

తుర్కయంజాల్ అక్టోబర్15(ప్రభాతవార్త)
తుర్కయం జాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ వెంకటేశ్వర కాలనీలో అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్, పాఠశాలలో నిర్వహించిన యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో విద్యార్థులు (ఉమెన్స్ రిజర్వేషన్స్ ఇన్ లెగిసాలాటివ్) అనే ముఖ్యమైన అంశంపై చర్చించి తమ ఆలోచనలను వెలిబుచ్చారు. విద్యార్థులు మహిళలు రాజకీయాల్లో పాల్గొనడం దేశ అభివృద్ధికి అవసరమని, మహిళా ప్రతినిధులు సమాజంలో మార్పుకు దారి చూపగలరని పేర్కొన్నారు. కొంతమంది విద్యార్థులు చట్టసభల్లో మహిళలకు సమాన అవకాశాలు ఇవ్వడం సమాజ సమతుల్యతకు దోహదమని చెప్పారు. ప్రతిపక్ష పాత్రలో పాల్గొన్న విద్యార్థులు రిజర్వేషన్లతో పాటు మహిళా విద్య, సురక్షిత వాతావరణం కూడా ముఖ్యమని వాదించారు. సభలో విద్యార్థుల ఆలోచనాత్మక మాటలు, చురుకైన చర్చలు చూసి ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ గుణాలు,వాక్చాతుర్యం, సామాజిక అవగాహన పెరుగుతాయని పాఠశాల ప్రిన్సిపల్ అరుణ, తెలియజేశారు. విద్యార్థుల మాట తీరు, ఆత్మవిశ్వాసం, సమాజం పట్ల చైతన్యం చూసి ఉపాధ్యాయులు, విద్యార్థులు చప్పట్లతో అభి నందించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో మాన్సూన్ స్పెషల్ డ్రైవ్

మాన్సూన్ కార్యక్రమంలో కార్పొరేటర్ లచ్చిరెడ్డి, సిబ్బంది

వనస్థలిపురం అక్టోబర్15,ప్రభాతవార్త
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీ ఫేస్ 2 ,మెడికల్ అండ్ హెల్త్ కాలనీ లో నిర్వహించిన మాన్సూన్ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ గారు మరియు బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి గారు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ కాలనీలలో సమస్యలను పరిష్కరించడంతో పాటు పరిశుభ్రకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ డిఈ నీలిమ, మెడికల్ అండ్ హెల్త్ కాలనీ అధ్యక్షులు మూర్తి, విజయపురి కాలనీ ఫేస్ 2 అధ్యక్షులు సుబ్బారావు,ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ చారి, మరియు పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ శర్మ, మహేందర్ రెడ్డి, విజయ్, మురళి, రాజు మరియు జిహెచ్ఎంసి అధికారులు ఉన్నారు.

ప్రభుత్వ బడులలో ఉపాధ్యాయులను నియమించాలి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బన్నాల ప్రవీణ్ తదితరులు

ఉప్పల్, అక్టోబరు 15 ప్రభాతవార్త :
చిలుకానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం చిలుకానగర్ డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నేత బన్నాల ప్రవీణ్, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి తదితరులతో కలిసి జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. ఉత్తీర్ణత శాతం కూడా అధికంగా ఉందని, విద్యార్థులు మంచి ర్యాంక్ సాధించారని అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. ఇంగ్లీష్, ఫిజిక్స్, బయో సైన్స్ కి ఉపాధ్యాయుల కొరత ఉందని, వెంటనే భర్తీ చేయాలని కోరారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారిణి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలి : హామీద్ పటేల్

మలక్ పేట, అక్టోబర్ 15, ప్రభాతవార్త:
గ్రేటర్ లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఏఐసీసీ పరిశీలకులు హామీద్ పటేల్ పేర్కొన్నారు. టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం సలీం నగర్ రజక సంఘం భవనంలో ఏర్పాటుచేసిన సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే కీలకమని పేర్కొన్నారు. రాబోయే జీహెచ్ ఎంసీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం సమిష్టిగా పని చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలని కోరారు. డీసీసీ అధ్యక్షుని ఎన్నిక కోసం తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. దేశంలోని పలు రాష్ట్రాలలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న ఎన్నికలలో మలక్ పేట్ లో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకలేకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలకు

సమావేశంలో ప్రసంగిస్తున్న హామీద్ పటేల్, చిత్రంలో చెకోలేకర్ శ్రీనివాస్, వైర్మన్ చెకోలేకర్ లక్ష్మీ, డైరెక్టర్లు ప్రత్యూష, కిషన్ సింగ్ తదితరులు

ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం పాటుపడుతున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మీ శ్రీనివాస్, డైరెక్టర్లు ప్రత్యూష మహేష్, కిషన్ సింగ్ ,నాయకులు లింగాల శ్రీనివాస్ గౌడ్, బోనగిరి చంద్రశేఖర్, కోశిక శ్రీనివాస్ రావు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు రాకతో ఆర్కేపురం ప్రజల కల నిజమైంది

ఎల్.బి.నగర్, అక్టోబర్ 15 ప్రభాతవార్త:
బస్సు రాకతో ఆర్కేపురం డివిజన్ ప్రజల కల నిజమైందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ పరిధి గుండా వెళ్ళే ఆర్టీసీ బస్సు సేవలను కరోనా తర్వాత నిలిపివేయడం జరిగింది. గత ఐదారు సంవత్సరాల తర్వాత బస్సుల సేవలు పునః ప్రారంభోత్సవంలో భాగంగా డివిజన్ పరిధిలోని వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ఆహ్వానం మేరకు నూతనంగా ప్రారంభమైన బస్సుకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, దిల్సుఖ్‌నగర్ డిపో మేనేజర్ సమంత, స్థానిక కాలనీవాసులు, బస్సు డ్రైవర్, కండక్టర్లతో కలిసి మంగళవారం పూజలు నిర్వహించి, జెండాను ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలను విన్నప్పుడు స్పందించడమే తన బాధ్యతని అన్నారు. డివిజన్ ప్రజలు గత అయిదారు సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న బస్సు రవాణా సౌకర్యాన్ని గుర్తించి దానికి పరిష్కారం చూపడం నా కర్తవ్యం అన్నారు. గత నెలలో వివిధ పనుల అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు వచ్చిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే కిచెన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి మార్గం చూపమన్నారు. ఇది ఒక ప్రారంభం మాత్రమే, డివిజన్ పరిధిలో అనేక పనుల అభివృద్ధి కోసం ప్రణాళిక బద్ధంగా ఇంకా చాలా చేయాల్సిందని పేర్కొన్నారు. ఈ బస్సుల పునః ప్రారంభం

ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మధురఉపేందర్‌రెడ్డి

వలన స్థానికులు, విద్యార్థులు, మహిళలు తమ రాక పోకల కోసం ఇకపై ఇబ్బందులు పడవలసిన అవసరం లేకుండా సౌకర్యవంతమైన రవాణా పొందగలుగుతారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం చైర్మెన్ తలాటి రమేష్‌నేత, శ్రీఖిల్లామైసమ్మ దేవాలయం చైర్మెన్ కుంచారపు సురేంద్ర కుమార్(సురేష్), జ్ఞానేశ్వర్‌యాదవ్, పెద్దవూర సైదులు, శేఖర్‌ముదిరాజ్, బొడ్డుపల్లి మహేందర్, మహమ్మద్, జగిని రమేష్, యాదవరెడ్డి, జెల్లా జగన్నాథం, శ్రీధర్, హరి, శ్రవణ్, సంతోష్, శశియాదవ్, అశోక్, శ్రీనాథ్, కాలనీ ప్రతినిధులు రాజశ్రీ రామారావు, వెంకటేశ్వర్లు, సాయి, శ్యామ్ సుందర్, భరద్వాజ్, రమేష్‌బాబు, సత్యనారాయణ, సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, నరసింహరెడ్డి, శేషు, వేమాద్రి శ్రీనివాస్, శ్రీకాంత్, సుజాత, సురేఖ, రేణుక, నీలిమ, రామ, శశిరేఖ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కలుషిత నీటి సరఫరా సమస్య

-జిల్లెలగూడ పాత గ్రామంలో ఆరు నెలలుగా నెలకొన్న సమస్య
-పరిష్కరించని అధికారులు.. ఆందోళన చెందుతున్న స్థానికులు

కలుషిత మంచి నీరు సరఫరా అవుతున్న జిల్లెలగూడలోని ప్రాంతం

సరూర్‌నగర్, అక్టోబర్ 15 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ పాత గ్రామంలో కలుషిత నీరు సరఫరా అవుతున్నది. జిహెచ్ఎంసికి ఆనుకొని ఉన్న ఈ గ్రామంలో దాదాపు ఆరు నెలల నుండి నల్లాల్లో కలుషిత నీరు వస్తున్నా ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాకపోవడం గమనార్హం. సాక్షాత్తు జిల్లెలగూడలోని పాత గ్రామ పంచాయతీ/మున్సిపల్ వార్డు ఆఫీస్‌లో కొనసాగుతున్న మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం కార్యాలయం ముందు వరుసలోనే ఉన్న ఇళ్ళల్లో మంచి నీటి నల్లాల్లో మురికి నీరు సరఫరా అవుతుండడం గమనించదగ్గ విషయం. కలుషిత నీరు సరఫరా అవుతున్న బాధితుల ఇళ్ళల్లో పూర్వ సరూర్‌నగర్ మండల మాజీ జడ్పీటిసి జిల్లెల నరేందర్‌రెడ్డి, జిల్లెలగూడ మాజీ సర్పంచ్ జిల్లెల వనితల ఇల్లు ఉండడం గమనార్హం. మంచి నీరు సరఫరా అయ్యే సమయంలో దాదాపు ఒక గంట పాటు నల్లాల్లో మురికి నీరు రావడం ఈ ప్రాంతంలో పరిపాటిగా మారింది. తర్వాత స్వచ్ఛమైన నీరు వస్తున్నా కొద్ది సేపటికే నల్లా బంద్ కావడంతో బోర్లు లేని ఇళ్ళ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా కలుషిత నీటి సరఫరా సమయంలో దుర్గంధపూరిత వాసనతో స్థానికులు సతమతవుతున్నారు. చాలా సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన డ్రైనేజీ పైప్‌లైన్ల పక్క నుండే మంచి నీటి పైపులైన్లు కూడా ఏర్పాటు చేయడం వల్ల కలుషిత నీటి సరఫరా సమస్య కలుగుతోందని తెలుస్తోంది. డ్యామేజీ అయితే డ్రైనేజీ పైపు లైన్ల ద్వారా మురికి నీరు నల్లా పైపుల్లోకి చేరడంతో ఇళ్ళల్లోకి కలుషిత నీరు వస్తున్నది.

డిఇఇ పరిశీలించినా పరిష్కారం కాని సమస్య
జిల్లెలగూడ పాత గ్రామంలోని ప్రధాన రోడ్డుకు ఉన్న పలు ఇళ్ళల్లో నల్లా నీటిలో మురికి నీరు సరఫరా అవుతున్న నేపథ్యంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు దాదాపు వారం, పది రోజుల క్రితం మున్సిపల్ కార్పొరేషన్ డిఇఇ వేణుగోపాల్ పరిశీలించారు. పలు ఇళ్ళల్లో వస్తున్న మురికి నీటిని స్వయంగా పరిశీలించిన ఆయన విచారం వ్యక్తం చేశారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లెలగూడ పాత గ్రామంలో కలుషిత నీరు సరఫరా అవుతున్న విషయం కమీషనర్ దృష్టిలో ఉన్నా ఫలితం లేకుండా పోయిందనే విమర్శలు వస్తున్నాయి.

సిడిఎంఎకు ఫిర్యాదు చేస్తాం : మాజీ జడ్పీటిసి జిల్లెల నరేందర్‌రెడ్డి
జిల్లెలగూడ ప్రధాన రహదారిలోని పాత గ్రామానికి సంబంధించిన పలు ఇళ్ళకు కలుషిత నీరు సరఫరా అవుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో సరూర్‌నగర్ మాజీ జడ్పీటిసి జిల్లెల నరేందర్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దాదాపు ఆరు నెలల నుండి ఈ సమస్య ఉన్నా అధికారులు ఇంకా జాప్యం చేస్తూ నిర్లక్ష్యంగా ఉండడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మురికి నీటి వల్ల అతిసారం లాంటి వ్యాధులు వ్యాపిస్తే బాధ్యులు ఎవరవుతారని ఆయన ప్రశ్నించారు. జిల్లెలగూడలో మురికి నీటి సరఫరా సమస్యలు, అధికారులు పట్టించుకోకపోవడం.. నిర్లక్ష్యంపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ చైర్మన్ అండ్ డైరెక్టర్ (సిడిఎంఎ)కు ఫిర్యాదు చేయనున్నట్లు నరేందర్‌రెడ్డి వెల్లడించారు.

అల్మాస్‌గూడ డివిజన్లలో తీవ్రమవుతున్న డ్రైనేజీ సమస్యలు

-తక్కువ డయా గల పైప్‌లైన్లతో మ్యాన్‌హోళ్లు నిండుతున్న వైనం
-రోడ్లపైకి నిత్యం ప్రవహిస్తున్న మురికి నీరు.. స్థానికుల అవస్థలు

అల్మాస్‌గూడలో పొంగి ప్రవహిస్తున్న డ్రైనేజీ సమస్యలను పరిశీలిస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి

సరూర్‌నగర్, అక్టోబర్ 15 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ డివిజన్లలో ప్రజలకు ఇబ్బందికరంగా మారిన రహదారులపై మురికి నీటి సమస్యల పరిష్కారానికి అధిక సామర్థ్యం గల భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్లను ఏర్పాటు చేయించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి స్పష్టం చేశారు. అల్మాస్‌గూడ పరిధిలోని వైఎస్ఆర్ పార్కు వద్ద చాలా కాలం నుండి అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యను బుధవారం ఆయన పరిశీలించారు. స్థానికులతో కలిసి వైఎస్ఆర్ పార్కు ఉన్న ప్రాంతంలో పాదయాత్రలు చేసి పర్యటించిన మల్లారెడ్డి పరిసర ప్రాంతాల ప్రజలు చాలా కాలం నుండి ఎదుర్కొంటున్న దీర్ఘకాల డ్రైనేజీ మురికి నీరు పారే సమస్యను ప్రత్యక్షంగా పరిశీలన జరిపారు. గత ప్రజాప్రతినిధుల పాలనలో అవగాహన లేకుండా ఏర్పాటు చేసిన తక్కువ డయా గల డ్రైనేజీ పైప్‌లైన్ల వల్లే నేడు ప్రజలు మురికి నీటి సమస్యలను ఎదుర్కొంటున్నారనేది ప్రస్తుత దారుణ పరిస్థితి చూస్తే అవగతమవుతున్నదని ఆయన వెల్లడించారు. ముందు చూపుతో పాలకులు వ్యవహరించని కారణంగా చిన్నపాటి వర్షాలు కురిసినప్పుడల్లా డ్రైనేజీలు నిండి పొంగి రోడ్లపైకి ప్రవహిస్తూ చికాకు కలిగిస్తున్నాయనేది అర్థమైందని ఆయన పేర్కొన్నారు. నిత్యం ఇక్కడి రోడ్లపై డ్రైనేజీ నీరు పారుతుండడం వల్ల తీవ్ర దుర్గంధం నెలకొనడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని ఆయన అన్నారు. ముఖ్యంగా స్థానిక 24, 25 డివిజన్ల పరిస్థితిలో డ్రైనేజీ సమస్యలు దారుణంగా ఉన్నాయని ఆయన విచారం వ్యక్తం చేశారు.

కెఎల్ఆర్ దృష్టికి తీసుకెళ్ళి అధిక సామర్థ్యం గల డ్రైనేజీ పైపులు ఏర్పాటు చేయిస్తా
ప్రజల సమస్యలపై స్పందించిన తాను స్వయంగా పరిశీలించిన నేపథ్యంలో ఇక్కడి డ్రైనేజీ సమస్యలను మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మల్లారెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం తక్కువ పరిమాణం గల (చిన్న డయా ఉన్న) పైపుల స్థానంలో పెద్ద డయా పైప్‌లను ఏర్పాటు చేయిస్తామని ఆయన తెలిపారు. ఈ మేరకు పైప్‌లైన్ల ఏర్పాటు కోసం అవసరమయ్యే సుమారు రూ.25 నుండి 30 లక్షల నిధులను కెఎల్ఆర్ సహకారంతో మంజూరు చేయించి ప్రజలు డ్రైనేజీ సమస్యలు తీరుస్తామని మల్లారెడ్డి స్థానికులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కె.వంశీ, నరేందర్, చంద్రం, హనుమాన్ ప్రసాద్, మల్లేష్, అమరేందర్, జగన్, బాబ్జి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రామంతాపూర్ శివాలయం భూమి లీజుకు వేలం

రామంతాపూర్, అక్టోబరు 15 ప్రభాతవార్త : పాత రామంతాపూర్‌లోని దేవాదాయ శాఖ ఆధీనంలో గల శ్రీ మల్లికార్జునస్వామి ఆలయానికి చెందిన రామంతాపూర్ భగాయత్ సర్వేనెంబర్ 1 లో గల ఒక ఎకరం 12 గుంటల ఖాళీ స్థలాన్ని లీజుకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి కె. సురేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఉప కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం మూడు సంవత్సరాల కాలానికి లీజుకు ఇవ్వడానికి ఈ నెల 22వ తేదిన ఉదయం 10:30 కు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గలవారు 984 8966212 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పిఅండ్‌టి కాలనీ సమస్యలపై వినతి

పిఅండ్‌టి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ కక్కిరేణి చేతనకు వినతిపత్రం ఇస్తున్న కాలనీ సంఘం నేతలు

ఉప్పల్, అక్టోబరు 15 ప్రభాతవార్త : హబ్సిగూడ డివిజన్ పరిధిలోని పిఅండ్‌టి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని పలువురు కాలనీ వాసులు బుధవారం స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు స్థానికులు మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ సమస్యలు, కొత్త సిసి రోడ్ల నిర్మాణం, నీటి బిల్లుల సమస్యలు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. దీనిపై కార్పొరేటర్ చేతన స్పందిస్తూ త్వరలోనే కాలనీలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కొత్త సిసి రోడ్లు త్వరలోనే ప్రారంభిస్తామని, నీటి బిల్లుల సమస్యలపై అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు అల్కాపురి సురేష్ పటేల్, కట్ట భాస్కర్, జ్యోతి ఉపేందర్, సతీష్ పటేల్,తదితరులు పాల్గొన్నారు.

బిజెపి అభ్యర్థి గెలుపు ఖాయం

సమావేశంలో మాట్లాడుతున్న పవన్‌కుమార్

ఎల్.బి.నగర్, అక్టోబర్ 15 ప్రభాతవార్త: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో బిజెపి అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం వెంగళరావునగర్ డివిజన్ పరిధిలో ప్రచారానికి సంబంధించిన కార్యాచరణ కార్యక్రమం డివిజన్ అధ్యక్షులు నవీన్, బీజేపీ నాయకులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో అనుసరించే వలసిన వ్యూహరచన గురించి వివరించారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి జూబ్లీహిల్స్ ప్రజలు బిజెపికి పట్టం కడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వగ్గల సుందర్‌నారాయణ, శరణ్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో కార్పొరేటర్లు పాదయాత్ర



నాచారం, అక్టోబర్ 15 ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా శ్రీనగర్ కాలనీ అంబేద్కర్ నగరంలో స్థానిక బారాసా నాయకులతో కలిసి ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, బీఆర్ఎస్ నాయకులు సాయి జన్ శేఖర్ ఇంటింటికీ తిరుతూ విస్తృతంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన మోసపూరిత హామీలను వివరించారు. అలాగే, కాంగ్రెస్ బాకీ కార్డులను కూడా ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాసరెడ్డి, కాసం మైపాల్ రెడ్డి, ఇంద్రయ్య, రహీం, కుమారస్వామి, భూపాల్ రెడ్డి, పిల్లి నాగరాజు, ప్రీతి రెడ్డి, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెంగిచెర్లలో మేకల మండిని తరలించాలి : చందర్ గౌడ్

చెంగిచెర్ల లోని మేకల మండిని సందర్శిస్తున్న మాజీ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్, కొత్త ప్రభాకర్ గౌడ్,రంగా బ్రహ్మన్న గౌడ్, కుర్రి శివశంకర్ తదితరులు

బోడుప్పల్, అక్టోబర్ 15 ప్రభాతవార్త :
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ చెంగిచెర్ల లోని మేకల మండి నుండి ప్రతిరోజు దుర్వాసన వస్తుందని చెంగిచెర్ల మాజీ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్ ఆధ్వర్యంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...మేకల మండిలో ఎముకల ద్వారా నూనె ఉత్పత్తి, చర్మాలు వ్యర్థాలు స్టోరేజ్ చేయడం వల్ల విపరీతంగా దుర్వాసన రావడంతో చిన్న పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, వ్యాధులు వ్యాపించడంతోపాటు దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయని, సిబ్బందితో మాట్లాడి దుర్వాసన రాకుండా తగిన చెర్యలు తీసుకోవాలని తెలిపారు. లేని యెడల ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చే ఈ జంతుల వ్యర్థ పదార్థాలా ఫ్యాక్టరీనీ తరలించాలని ప్రజలతో కలిసి ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చెంగిచెర్ల మాజీ గ్రామ పంచాయతీ సభ్యులు కొత్త ప్రభాకర్ గౌడ్, కుర్రి శివశంకర్ ,మాజీ కోఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్న, కొత్త సుశాంత్ గౌడ్ , గణేష్ నాయక్ , ఉమేష్ చారీ, బండారు సాయి,లింగస్వామి,కట్ట జగన్ సోమేష్ ,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

ఎల్బీనగర్ డిసిపిగా నూతనంగా నియమితులైన డాక్టర్ బి.అనురాధ (ఐపీఎస్)ను మంగళవారం ఎల్బీనగర్ డిసిపి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలి